


కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో హాకీ ఆడుతున్న మహిళలు, పురుషులు

చదువుల్లోనే కాదండోయ్.. ఆటల్లోనూ తగ్గేదేలే అన్నారు.. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు వారాలుగా హోరా హోరీగా సాగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. పోటీల్లో భాగంగా మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌కు ట్రోఫీ అందజేసి అభినందించారు.

హాకీలోనూ.. సివిల్ పవర్ చూపారు!



6

గోదాటిలో.. తలపడ్డారు!

బైక్ రేస్ తెలుసు.. కార్ రేస్ తెలుసు.. మరి బోట్ రేస్ గురించి ఇప్పటివరకూ ఎక్కడైనా విన్నారా.. చూశారా.. విని ఉంటారు కానీ చూసి ఉండరు.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం బోట్ రేస్ సాగింది.. సుమారు 15 బోట్లపై పడవలు వేసుకుని హోరాహోరీగా ఇలా తలపడ్డారు.. ముగ్గురు విజేతలుగా నిలిచారు.



7



సంక్షేమ.. పద్దు పొదుపు!

సంక్షేమంలో 'పద్దు' పొడిచింది.. పయ్యావుల పద్దు సంక్షేమం, అభివృద్ధి మంత్రం జపించింది. అన్ని వర్గాల ను లక్ష్యంగా చేసుకుని వరాల వాన కురిపించింది. మహిళలను మురిపించి.. అన్నదాతలను మెప్పించి... పేదలకు ధీమా కల్పిస్తూ బడ్జెట్ పద్దు బహుబాగు అనిపించింది. పేదలకు ఆరోగ్య ధీమా కల్పించింది. ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నట్టు ప్రకటించి ధైర్యం ఇచ్చింది.. ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు శ్రీకారం చుట్టేలా పద్దులో కేటాయింపులు చేసింది.. - (కాకినాడ/ఆంధ్రజ్యోతి)

కూటమి సూపర్ బడ్జెట్

బీమా...ఆరోగ్య ధీమా..

పేద వర్గాలకు ఆరోగ్యపరంగా ధీమా కల్పించేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని పేదలకు అమలు చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.19,264 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ప్రకటించిన రూ.25 లక్షల ఆరోగ్య బీమా పేదల జీవితాలకు మేలి మలుపే. ఈ బీమాతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పైసా చెల్లించక్కర్లేకుండా చికిత్స పొందొచ్చు. ఈ వరంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 12.50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

తల్లులకు ఇక పండగే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కూటమి ప్రభుత్వం రూ.9,407 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు,కాలేజీలో చదువుతున్న ఒకటి నుంచి 12వ తరగతి వరకు రూ.15 వేలు జమ చేస్తామని ప్రకటించారు. మే నెలలోగా తల్లుల ఖాతా ల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. జిల్లాకు రూ.2,476 కోట్ల నిధులొస్తాయి.

మరింత ఆదరణ..

గత టీడీపీ ప్రభుత్వంలో బీసీల్లో ఆయా వర్గాల స్వయం ఉపాధికి అనుగుణంగా ఆద రణ పథకం కింద సీఎం చంద్రబాబు పని ముట్లను అందించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదరణ అటకెక్కించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఆద రణ పథకం అమలుకు శుక్రవారం నాటి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు ప్రకటించారు.

సొంతింటి కల నెరవేరినట్లే..

బడ్జెట్‌లో ప్రధానంగా రహదారుల శాఖకు రూ.8,785 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో అనేక రహదారుల మరమ్మతులకు, కొత్త వాటికి నిధులు రానున్నాయి. గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు కేటాయించడంతో పేదల ఇళ్లకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆధునికీకరణ పనులకు రూ.848 కోట్లు కావాలి. అయితే ఈ రెండేళ్లలో వీటిని పట్టాలెక్కించేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించి కేటాయింపులు పెరిగాయి. ఆదికవి నన్నయ వర్సిటీకి రూ.12.50 కోట్లు, జేఎన్టీయూకి రూ.60 కోట్లు కేటాయించారు.

- అదిరిన 'పయ్యావుల' పద్దు
- రూ.25 లక్షల ఆరోగ్య బీమా
- 12.50 లక్షల కుటుంబాలకు ధీమా
- మే నుంచే తల్లికి వందనం
- 16.51 లక్షల మంది పిల్లలకు లబ్ధి
- అన్నదాత సుఖీభవకు 4.54 లక్షల మంది
- 19.80 లక్షల మందికి ఆదరణ
- స్కూళ్లకు కరెంటు బిల్లు బాధలేనట్టే
- మునిసిపాలిటీలకు మళ్లీ ఆర్థిక స్వేచ్ఛ
- మత్స్యకారులకు నిధుల పొంగు

మునిసిపాలిటీలకు వీడిన సంకెళ్లు

పట్టణాలు, నగరాల అభివృద్ధిలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లదే కీలకపాత్ర. గత వైసీపీ ప్రభు త్వం వీటిని పూర్తిగా సర్వనాశనం చేసేసింది. గడచిన ఐదేళ్లలో మునిసిపాలిటీల్లో డబ్బులు ఖర్చుచేయడం గగనంగా మారింది. ఏప్రిల్ నుంచి మునిసిపాలిటీలు తమ చెల్లింపులు తమ నిధుల నుంచి ఖర్చుచేసుకునేలా కీలక నిర్ణయం ప్రకటించింది. దీంతో పుర పాలికలకు మళ్లీ మంచిరోజులు వచ్చినట్లయింది.

మత్స్యకారులకు వరం..

మత్స్యకార భరోసా రూ.450 కోట్లు కేటాయించారు. ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునే పేరుతో అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని రూ.20 వేలు చేస్తామని చెప్పింది. బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించింది.ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది మత్స్యకారులకు మేలు జరగనుంది.

తాగునీటికి.. బెంగ లేదిక..

జలజీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో 8.46 లక్షల కుళాయిలను అందించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.1, 203 కోట్లతో ప్రణాళికలు రచించారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేసింది. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా విధిం చుకుంది. బడ్జెట్‌లో రూ.2,800 కోట్లు కేటాయించింది. ఈ పథకానికి నిధుల బెంగతీరింది.

బడికి బిల్లులు బాధ తీరినట్టే..

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇవ్వనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2 వేలకుపైగా స్కూళ్లు ఉన్నాయి. ఇకపై ఉచితంగా విద్యుత్ ఇవ్వనుండడంతో పాఠశాలలకు నిధుల బెంగ తప్పనుంది.

మురిపించేను

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం రైతులను సంతృప్తిపరిచింది. ఎంతో కాలంగా డెల్టా ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలు మూలనపడిపోయాయి. పోలవరం ప్రాజెక్టు సైతం నత్తనడకన సాగుతోంది. బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు రూ.6705 కోట్లు కేటాయించడంతో పనుల వేగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఇటీవల 900 కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. సాధ్యమైనంత మేర నిర్వాసితులందరినీ కాలనీలకు చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇక ధవళేశ్వరం కేంద్రంగా ఉన్న గోదావరి డెల్టా సిస్టమ్ ఆధునికీకరణకు రూ.200 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ఏటిగట్ల అభివృద్ధికి మరో రూ.200 కోట్లు కేటాయించారు. పోలవరం లిఫ్ట్‌కు రూ.100 కోట్లు, తాడిపూడి ఎత్తిపోతల పథకానికి రూ.14 కోట్లు, వెంకటనగర్ ఎత్తిపోతలకు రూ.4 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు రూ.75.51 కోట్లు, సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు రూ.7.5 కోట్లు కేటాయించి జీవం పోవారు. ధవళేశ్వరం ఇరిగేషన్ పరిధిలో వేసవి కాలంలో చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు రూ.75 కోట్లు కేటాయించారు. ఆయిల్ పామ్ పంటల ప్రోత్సాహ నికి తూర్పు గోదావరి జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసింది.బడ్జెట్‌లో రూ.7,556 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి అనేక రకాల పథకాల అమలుకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

అన్నదాత.. సుఖీభవ


సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ మేరకు రూ.6,300 కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇక సాగు ఖర్చుల బెంగ తీరనుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరుతో కేంద్రవాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి అన్నదాతలను మోసం చేసింది. రైతులకు అండగా చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఫలితంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

ప్రాజెక్టు	రూ.కోట్లలో
పోలవరం ప్రాజెక్టు	6,705
గోదావరి డెల్టా సిస్టమ్‌కు	200
ఏటిగట్ల అభివృద్ధికి	200
పోలవరం లిఫ్ట్‌కు	100
తాడిపూడి ఎత్తిపోతలకు	14
వెంకటనగర్ ఎత్తిపోతలకు	4
పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు	75.51
తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు	7.5

సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు

అభివృద్ధి, సంక్షేమాలకు వారధిగా బడ్జెట్

-జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట ఎమ్మెల్యే



జగ్గంపేట,(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాలకు వారధిగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. అన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు, సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

జనరంజక బడ్జెట్

- చినరాజప్ప, పెద్దాపురం ఎమ్మెల్యే



సామర్లకోట(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నిరంగాల అభివృద్ధికి సమతూకంలో నిధుల కేటాయింపులు జరపడంతో జనరంజక బడ్జెట్‌గా నిలిచింది. ప్రజలకు ఇచ్చిన హామీలు నూటికి నూరుశాతం అమలుకు బడ్జెట్ రూపకల్పన చేశారు.

అన్ని వర్గాలకు సూపర్ బడ్జెట్ ఇది

-వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే



ప్రత్తిపాడు,(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు మేలు చేకూర్చే సూపర్ బడ్జెట్ ఇది. సూపర్ సిక్స్ హామీలు అమలుకు పూర్తి స్థాయి కేటాయింపులు చేస్తూ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ప్రజా రంజకమైనది. రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపు జరిగింది.

రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా బడ్జెట్

-కొండబాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే



కాకినాడ సిటీ, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా బడ్జెట్ ఉంది. సీఎం, డిప్యూటీ సీఎం ఆలోచనా విధానాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంకోసం అధికంగా కేటాయింపులు జరిగాయి. రూ.3.22లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉంది.

అన్నివర్గాలకు మేలు చేసే బడ్జెట్

-నానాజీ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే



సర్పవరంజంక్షన్,ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేసేలా ప్రజారంజకంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పూర్తి నిబద్ధతతో బడ్జెట్ కూర్పు జరిగింది. సూపర్ సిక్స్ హామీల అమలుకు బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించారు.

మత్స్య, ఆక్వారంగాలకు ఊతమిచ్చింది

-యనమల దివ్య, తుని ఎమ్మెల్యే



తునిరూరల్,ఆంధ్రజ్యోతి: మత్స్య, ఆక్వారంగాలకు ఊతమిచ్చేలా బడ్జెట్ ఉంది. స్వర్ణాంధ్ర 2047 నిర్దేశించిన లక్ష్యాలు సాధనకు ఈ రంగాలను గ్రోత్ ఇంజన్‌గా గుర్తించడం శుభపరిణామం. భవిష్యత్తులో మత్స్య, ఆక్వారంగాలకు ఊతం ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయం.

బడ్జెట్‌ను ప్రజలు స్వాగతిస్తున్నారు

-శిరీష, రంపచోడవరం ఎమ్మెల్యే



రంపచోడవరం, ఆంధ్రజ్యోతి: బడ్జెట్‌లో అన్నివర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. రాష్ట్రప్రజలుబడ్జెట్‌ను స్వాగతిస్తున్నారు. గిరిజనులకు రూ.7557 కోట్లు కేటాయించిఅడవిబిడ్డలను ఆదుకున్నారు. దళితులకు రూ.18వేలకోట్లు కేటాయించి సీఎం చంద్రబాబు దళిత బాంధవుడిగా నిలిచారు.

కనుల పండువగా కుక్కుటేశుని తెప్పోత్సవం



పిఠాపురం పాదగయ పుష్కరణిలో హంస వాహనంపై కుక్కుటేశుని తెప్పోత్సవం నిర్వహిస్తుండగా బాణసంచా కాలుస్తున్న దృశ్యం 7

నేటినుంచి ఇంటర్ పరీక్షలు



- అన్ని సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి
- ప్రథమ సంవత్సర పరీక్షలకు హాజరుకానున్న 22,660మంది విద్యార్థులు
- ఆలస్యమైతే అనుమతి లేనట్టే..

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శనివారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జరుగుతాయని ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు అనుమతి ఉండదన్నారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 22,660మంది, రెండోఏడాది పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 21,871మంది హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలు మార్చి 1నుంచి ప్రారంభమై 20 వరకూ కొనసాగుతాయన్నారు. మార్చి 1న ప్రథమ, 3న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని, తాగునీరు, అత్యవసర వైద్యసదుపాయం, నిరంతర విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారులు, అదనపు డీవోలు, 3ఫ్లయింగ్ 3సిట్టింగ్ స్క్వాడ్స్‌ని నియమించామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని పేర్కొన్నారు.

నేడే పింఛన్ల పంపిణీ

- ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు రూ.116 కోట్లు కేటాయింపు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు జిల్లాలో 2,71,059 మందికి రూ.116కోట్లు కేటాయించినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన వెలువరించారు. శనివారం ఉదయం 7గంటలనుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. దీనిలో ఓఏపీ పింఛన్లు 1,31,500, వితంతవు పింఛన్లు 73,184, దివ్యాంగులు 34,803, ఒంటరి మహిళలు 7806, మత్స్యకారులు 6249, చేనేత కార్మికులు 3426, డప్పు కళాకారులు 1574, అభయాస్తం 6068, ట్రాన్స్‌జండర్ 108, చిత్రకారులు 97, సైనిక్ వెల్ఫేర్ పెన్షన్లు 18మందికి అందజేస్తున్నట్లు వెల్లడించారు. పింఛన్‌దారుల ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. 21 మండలాల్లో 66.84శాతం పోలింగ్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో 66.84శాతం నమోదైంది. ఈ మేరకు కలెక్టరేట్‌నుంచి 21 మండలాల పోలింగ్ శాతాలు శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. వాటి వివరాలివి. కోటనందూరు మండలం 77.71శాతం, తొండంగి 63.88, తుని 71.30, ప్రత్తిపాడు 75.14శాతం, రౌతులపూడి 74.32, శంఖవరం 71.23, గొల్లప్రోలు 70.04 శాతం, పిఠాపురం 66.56శాతం,యు.కొత్తపల్లి 72.59శాతం,కాకినాడరూరల్ 62.80శాతం, కరప 71.63శాతం, పెద్దాపురం 68.28శాతం, సామర్లకోట 65.50శాతం, పెదపూడి 68.42శాతం, కాకినాడఅర్బన్ 62.07శాతం, కాజులూరు 63.93శాతం,తాళ్లరేవు 73.95శాతం,గండేపల్లి 76.07శాతం, జగ్గంపేట70.51శాతం,కిర్లంపూడి72.70శాతం,ఏలేశ్వరం74.86శాతం నమోదైంది.

రీజనల్ సైన్స్ సెంటర్‌కి స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిపాదన
- కేంద్రానికి సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ లేఖ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బొమ్మూరు వద్ద నిర్మించిన రీజనల్ సైన్స్ సెంటర్‌కు స్వామి జ్ఞానానంద పేరును పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతికశాఖ కార్యదర్శికి రాష్ట్రప్రభుత్వ అటవీ పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము లేఖ రాశారు. రాజమహేంద్రవరంలో రూ15.20 కోట్లతో ఈ సెంటర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. న్యూక్లియర్ సైన్స్ బోధనలో స్వామి జ్ఞానానంద తన ప్రత్యేకత చాటుకున్నారు. ఎందరో విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తయారు చేసిన స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలని లేఖలో పేర్కొన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల 7

నేటి నుంచి అమల్లోకి కొత్త మోటార్ వెహికల్ చట్టం

7

- లైసెన్సు లేకపోతే రూ.5వేలు
- సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా

మునిసిపల్ గెస్ట్‌హౌస్‌లో పాడా కార్యాలయమా?

- పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీ కౌన్సిలర్ల బైఠాయింపు
- అజెండా కాపీలు చించివేసిన టీడీపీ కౌన్సిలర్లు.. వాకౌట్

పిఠాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అతిథిగృహాన్ని పాడా కార్యాలయం ఏర్పాటుకోసం కేటాయించడంపై వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌కు సమాచారం లేకుండా ఏకపక్షంగా నిర్ణయం ఎలా తీసుకుంటారని కమిషనర్‌ని నిలదీశారు.

పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్‌హాలులో శుక్రవారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మునిసిపల్‌కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. తొలుత మాజీ మునిసిపల్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్ఆర్ మూర్తి మృతికి కౌన్సిల్ సంతాపం ప్రకటించింది. అనంతరం వైసీపీ కౌన్సిలరు సోమరౌతు లలితాదేవి మాట్లాడుతూ మునిసిపల్ గెస్ట్‌హౌస్‌ను ఎందుకు శుభ్రం చేస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్‌కు తెలియజేయకుండా పాడా కార్యాలయానికి ఎలా కేటాయిస్తారన్నారు. కౌన్సిలరు బోనుదేవ, కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ మాట్లాడుతూ మునిసిపల్ గెస్ట్‌హౌస్ ఖాళీగా ఉందని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ప్రభుత్వం పిఠాపురంలో పాడాకార్యాలయం ఏర్పాటు చేయమని ఆదేశించిందని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గెస్ట్‌హౌస్‌ను శుభ్రం చేశామని కమిషనరు నామా కనకారావు తెలిపారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు




టేబుల్ అజెండా కాపీలను చించివేస్తున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్

వైసీపీ కౌన్సిలర్ల నిరసన

మునిసిపల్ గెస్ట్‌హౌస్‌ను పాడా కార్యాలయానికి కేటాయించడాన్ని నిరసిస్తూ వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో బైఠాయించారు. తక్షణం గెస్ట్‌హౌస్‌ను ఏ ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించవద్దంటూ తీర్మానం చేసేందుకుగాను టేబుల్ అజెండాకు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రెండు గంటలపాటు నిరసన కొనసాగించారు. 22మంది సభ్యులు రిక్విజిషన్ ఇవ్వడంతో అప్పటికప్పుడు అజెండా తయారు చేశారు.పాడాతోపాటు ఏ కార్యాలయానికి కౌన్సిల్ అనుమతి లేకుండా మునిసిపల్ గెస్ట్‌హౌస్ కేటాయించవద్దంటూ తీర్మానం చేశారు.

అజెండా కాపీలు చించివేత

కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టించేలా టేబుల్ అజెండా తయారు చేయడంపై టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 22మందికౌన్సిలర్లు కోరితే 32మంది కోరినట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనికి నిరసనగా అజెండా కాపీలను నగేష్ చించివేశారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్లందరూ సమావేశంనుంచి వాకౌట్ చేశారు. అభివృద్ధిని అడ్డుకునేలా వ్యవహరించడం తగదంటూ వైసీపీ కౌన్సిలరు బొజ్జా రామయ్య సహచర వైసీపీ కౌన్సిలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడా కార్యాలయం ఏర్పాటు ద్వారా నిధులు వస్తాయని, అటువంటప్పుడు దానిని అడ్డుకోవడం ఏంటని ఆసహనం ప్రకటిస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారు.



ప్రకృతి వ్యవసాయంతో తళ్లినయ్యా!

అశ్విని

70 సెంట్ల నేలలో అద్భుతాలు సృష్టిస్తున్న అశ్విని

> కుగ్రామంలో జన్మించింది. ప్రకృతిని నమ్మింది. నేలను సంరక్షించుకుంటే ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని నిరూపించింది. సత్ఫలితాలు సాధించింది. జాతీయ అవార్డు సాధించి చరిత్ర సృష్టించింది. జాతీయ సేంద్రియ ప్రకృతి వ్యవసాయ కేంద్రం, భారత ప్రభుత్వ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఫిబ్రవరి 23, 24 తేదీల్లో నాగపూర్‌లో సేంద్రియ వ్యవసాయంపై జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో మొత్తం 15 జాతీయ పురస్కారాలు అందించగా అందులో ఏడు మన రాష్ట్ర రైతులకే దక్కడం విశేషం. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మహిళకు కూడా పురస్కారం దక్కింది.

- నేలను రక్షించి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం
- ఆరోగ్యంగా ఉండాలంటే భూమిని రక్షించుకోవాలి
- ప్రకృతి వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలి
- జాతీయ స్థాయి పురస్కార గ్రహీత అశ్విని పిలుపు

(కాట్రేనికోన-ఆంధ్రజ్యోతి)

కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన 32ఏళ్ల గెద్దాడి అశ్విని బీఏ, బీఈడీ చదివింది. ఆమెకున్నది కేవలం 20సెంట్ల నేల మాత్రమే. మరో 50 సెంట్లు కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేసి అద్భుతాలు సృష్టించింది. నేలను కాపాడుకుంటే... నేల మనల్ని కాపాడుతుందని అశ్విని అంటోంది. పంట మార్పిడి ద్వారా భూసారాన్ని రక్షించుకోవచ్చని నిరూపించింది. రైతులు ప్రకృతి సాగు విధానాలను అవలంబించాలని ఆమె కోరుతున్నారు. సేంద్రియ వ్యవసాయంపై నాగపూర్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఉత్తమ అవార్డు అందుకున్న అశ్వినితో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రకృతిని గుర్తించి వ్యవసాయం చేస్తే అంతా మేలే జరుగుతుంది. మాది వ్యవసాయ కుటుంబం. కేవలం 20 సెంట్లు నేల ఉంది. మరో 50 సెంట్లు కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాను. వరి, కాయగూరలు, ఆకు కూరలు... ఇలా వివిధ రకాలు సాగు చేస్తుంటాను. 2019 నుంచి ఆర్గానిక్ సాగు మొదలుపెట్టాను. కషాయాలు, జీవామృతాలు వంటి సహజ పద్ధతులతో చీడపీడలు నివారణ, సేంద్రియ ఎరువుల ద్వారా భూసార పరిరక్షణ చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీస్తుంటాను. పంట మార్పిడిద్వారా నేల సారాన్ని పెంచుకుంటూ వస్తున్నాను. గట్లపై కాయగూరలు పండిస్తుంటాను. ఆకుకూరలు పెంచి విక్రయిస్తుంటాను. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో ఆకుకూరలు, కాయగూరలు పెంచడం అలవాటైంది. ప్రతి ఆదివారం కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆకుకూరలు, కాయగూరలు విక్రయిస్తాను. నాకు మూడేళ్ల పాప ఉంది. మా వారు కూడా వ్యవసాయమే చేస్తుంటారు. ఎప్పటికప్పుడు సేంద్రియ సాగులో ప్రయోగాలు, ఫలితాలపై డాక్యుమెంటేషన్ చేసి, వ్యవసాయాధికారులకు పంపుతాను. నాకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. అందుకు నాకు సహకరించిన ఈవీసీ విజయకుమార్, డీపీఎం లక్ష్మానాయక్, డివిజన్ ఇన్‌చార్జి రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ధన్యవాదాలు. మరి కొందరు రైతులను సేంద్రియ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాను.

> నాకు థైరాయిడ్, పీసీవోడీ సమస్యలున్నాయని... గర్భధారణ కష్టమని వైద్యులు తేల్చేశారు. అప్పుడు నా సమస్యను సేంద్రియ వ్యవసాయమే పరిష్కరించింది. సేంద్రియ సాగు ద్వారా పండించిన ఆహారం మాత్రమే తినడంవల్ల గర్భకోశ సమస్యలు పరిష్కారమయ్యాయి.



అశ్విని అందుకున్న జాతీయ అవార్డు, ప్రశంసాపత్రం



వరిచేల గట్లపై కూరగాయల సాగు



కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద కూరగాయల స్టాల్‌లో అశ్విని





కేరళ స్ట్రైకర్స్ ఐబీ చెన్నై జట్ల క్రీడాకారుల మధ్య పోరు

జోరుగా... హుషారుగా వాలీబాల్ పోటీలు

- పరిశీలించిన రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు
- టోర్నమెంటు నిర్వహణ తీరుపై ప్రశంసలు



ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి హైస్కూలు క్రీడా మైదానంలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం వాలీబాల్ కోర్టును పరిశీలించింది. పోటీల నిర్వహణ తీరుపై ఆటగాళ్లను, ప్రేక్షకులను అడిగి తెలుసుకుంది. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగొలకోటి ఫణీంద్రకుమార్‌తో అసోసియేషన్ సభ్యులు చర్చించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవిరాజు, కోశాధికారి బ్రహ్మాజీ టోర్నమెంటు నిర్వహణ తీరును ప్రశంసించారు. కాగా మొదటి మ్యాచ్ కేరళ స్ట్రైకర్స్, ఐబీ చెన్నై మధ్య నువ్వా... నేనా అన్న రీతిలో జరిగింది. బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో విజయం నిర్ధారించారు. 3-2 తేడాతో కేరళ స్ట్రైకర్స్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు, జీఎస్టీ (ముంబయి) జట్ల మధ్య జరిగింది. వరుసగా మూడు సెట్లు గెలుచుకుని జీఎస్టీ విజేతగా నిలిచింది.



తలపడుతున్న జీఎస్టీ (ముంబై), బెంగళూరు జట్ల క్రీడాకారులు

ఉత్సాహభరితంగా..

● ముగిసిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

- రెండువారాల పాటు కాకినాడలో కొనసాగిన పోటీలు
- పురుషుల విభాగంలో విజేత ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్
- మహిళల విభాగంలో విజేత ఒడిశా సెక్రటేరియట్



పురుషుల విభాగంలో : కాకినాడ క్రీడా మైదానంలో తలపడుతున్న హైదరాబాద్ వర్సెస్ ఢిల్లీ

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో రెండు వారాలుగా జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో పురుషుల విభాగంలో ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్ టీమ్, మహిళల విభాగంలో ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఏపీ, తెలంగాణ రీజియన్ ఇన్‌కమ్ ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్, అర్జున, రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డుల విజేత, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధనరాజ్ పిళ్లై హాజరై విజేతలకు, రన్నర్ అప్ టీమ్‌లకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి ఆనంద్ రాజేశ్వర్ బైవార్ మాట్లాడుతూ తొలిసారి ఆతిథ్యం ఇచ్చి టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన కాకినాడ జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సాహంగా వచ్చి క్రీడా స్ఫూర్తితో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులను అభినందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడలతో మంచి శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వం చేకూరుతుందని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధనరాజ్ పిళ్లై మాట్లాడుతూ దేశంలో క్రికెట్ తరహాలో హాకీ క్రీడలకు క్రేజ్ లేనప్పటికీ యువత ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో సంతోషమన్నారు. హాకీ క్రీడాకారులు నిరంతరం ప్రాక్టీస్ చేసి తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, విశాఖపట్నం ఇన్‌కమ్‌టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు. పోటీలు ముగిసిన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



వేదికపై మాట్లాడుతున్న ఆనంద్ రాజేశ్వర్(డైరెక్టర్ ఆఫ్ లింగం ట్యాక్స్)



వేదికపై మాట్లాడుతున్న భారత హాకీ జట్టు మేనేజర్ ధనరాజ్ పిళ్లై

టోర్నమెంట్‌లో విజేత జట్లు ఇవే..

మొదటి స్థానం: సెంట్రల్ సెక్రటేరియట్,
రెండో స్థానం: ఆర్ఎస్పీ హైదరాబాద్,
మూడోస్థానం: హర్యానా సెక్రటేరియట్
(పురుషుల విభాగం)

మొదటిస్థానం: ఒడిశా సెక్రటేరియట్,
రెండోస్థానం: సెంట్రల్ సెక్రటేరియట్,
మూడోస్థానం: హర్యానా సెక్రటేరియట్
(మహిళల విభాగం)

టోర్నమెంట్‌లో బహుమతులు పొందిన క్రీడాకారులు:

మహిళలు: రీతురాణా, జోసఫ్ ప్రధాన్, మౌనిక వైంగేడ్, కేఎల్ నాగలక్ష్మీ

పురుషులు: విశాల్‌సింగ్, ప్రమోద్, సూర్యప్రకాష్, దీపక్ షైనీ

బెస్ట్ టోర్నమెంట్ ఆఫ్ ది ప్లేయర్స్: వినయ్‌రాణా (సెంట్రల్ సెక్రటేరియట్), సోనికా(సెంట్రల్ సెక్రటేరియట్). దీనిలో భాగంగా వారికి ప్రశంసాపత్రాలు అందించారు.

మూడో స్థానం కోసం రసవత్తర పోరు

మహిళల ఫైనల్స్: ఒడిశా సెక్రటేరియట్ జట్టు, సెంట్రల్ సెక్రటేరియట్ జట్లు తలపడగా ఒడిశా సెక్రటేరియట్ జట్టు 4-2 తేడాతో గెలుపొందింది. మహిళల మూడో స్థానం కోసం జరిగిన పోటీల్లో హర్యానా సెక్రటేరియట్ జట్టు, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు తలపడగా హర్యానా 4-2 తేడాతో గెలిచింది.

పురుషుల ఫైనల్స్: సెంట్రల్ సెక్రటేరియట్ జట్టు, ఆర్ఎస్పీ హైదరాబాద్ జట్లు తలపడగా సెంట్రల్ సెక్రటేరియట్ జట్టు 4-2 తేడాతో గెలిచింది. పురుషుల మూడోస్థానం కోసం జరిగిన పోటీల్లో హర్యానా సెక్రటేరియట్ జట్టు, ఒడిశా సెక్రటేరియట్ జట్లు తలపడగా హర్యానా సెక్రటేరియట్ 7-2 తేడాతో గెలిచింది.



మహిళల విభాగంలో : ఒడిశా వర్సెస్ ఢిల్లీ



విజేతగా నిలిచిన ఒడిశా మహిళా జట్టు



మొదటి స్థానంలో నిలిచిన ఢిల్లీ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ అందుకుంటున్న ఢిల్లీ మహిళల జట్టు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

గోదావరిలో బోట్ రేస్


బోట్ రేస్‌లో పాల్గొన్న బోట్లు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి నదిలో బోట్ రేస్ అట్టహాసంగా జరిగింది. నదీజలాలపై అవగాహన కల్పించడానికి జాతీయ జలవనరుల శాఖ, జలశక్తి విభాగం, నదీసంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. దీనిని కమిషనర్ కేతన్ గార్గ్ జెండా ఊపి ప్రారంభించారు. పుష్కరాలరేవు ఎదురుగా ఉన్న గోదావరి లంక నుంచి 15 నావలు ఈ పోటీలో పాల్గొన్నాయి. లంక నుంచి పుష్కరాలరేవుకు ఈ రేస్ నిర్వహించారు. ఇంజన్ బోట్లు కాకుండా ఏతం వేసే బోట్లను పోటీలో దింపారు. సుమారు గంట పాటు జరిగిన పోటీలో ప్రథమ స్థానంలో నాతి పోసయ్య, ద్వితీయ స్థానంలో మల్లాడి సుబ్బన్న, తృతీయ స్థానంలో పోతాబత్తుల నాగరాజు నిలిచారు. ప్రథమ బహుమతిగా రూ25వేలు, ద్వితీయ బహుమతిగా రూ15వేలు. తృతీయ బహుమతిగా రూ10వేలు నగదును సాయంత్రం పుష్కరాలరేవులో జరిగిన ముగింపు కార్యక్రమంలో అందించారు. గోదావరి జలల పరిరక్షణ కోసం ఈ బోట్ రేస్‌ను ఏర్పాటు చేశామని కమిషనర్ చెప్పారు.


బోట్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్



జనసేన ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : మంత్రి నాదెండ్ల


జనసేన ఆవిర్భావ వేడుకల సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఇతర నేతలు

పిఠాపురం/పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్‌లో మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ వేడుకల సభాస్థలిని ఆయన శుక్రవారం రాత్రి పరిశీలించారు. ప్రధాన వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీకి సూచనలు చేశారు. మహిళలు ఏ ఇబ్బంది లేకుండా నేరుగా సభాస్థలికి చేరుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది పార్టీ శ్రేణులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సభ కారణంగా ఎవరికి ఇబ్బంది కలగకుండా చేయాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం అనంతరం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, నాయకులు వై.శ్రీనివాస్, బోడపాటి శివదత్, తలాటం సత్య, మండలి రాజేష్, తోట సత్యనారాయణ, చల్లా లక్ష్మీ, మురాలశెట్టి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆవిర్భావ వేడుకల సభ నిర్వహణ ఏర్పాట్లుకు శనివారం సాయంత్రం 4గంటలకు భూమి పూజ జరగనున్నది.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి : వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం విజ్ఞానం వైపు అడుగులు వేసే మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వికసిత్ భారత్ కోసం సైన్స్ అండ్ ఇన్నోవేషన్-2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా మేధోపరమైన విజన్‌తో ముందుకు సాగాలన్నారు. మరో అతిథి కోస్తా ఆంధ్ర రేంజ్ డీఐజీ ఎం.ఆర్. రవికిరణ్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పినట్టు సినిమాను సినిమాలాగే చూడాలని, నిజజీవితంలో వాటిని అన్వయించుకోకూడదని చెప్పారు. ఈజీమని కోసం ఎవరూ ఆశపడకూడదని, అటువంటి వారు జైళ్లో మగ్గుతున్నారని చెప్పారు. గంజాయి మత్తులో తల్లిదండ్రులను చంపిన వారు జైళ్లల్లో ఉన్నారని, గంజాయి సంబంధిత సమాచారాన్ని 1972 నెంబరుకు తెలియజేయాలన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త చంద్రశేఖరం మలపాక ప్రతీ ఏడాది సైంటిఫిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులపై చర్చలు జరగాలని చెప్పారు. అనంతరం ఆచార్య మురళీకృష్ణ, కె.నూకరత్నం రాసిన స్పాటియల్ అనాలసిస్ అండ్ జియో విజువలైజేషన్ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ధృవపత్రాలను అందజేసారు. కెమిస్ట్రీ విద్యార్థి బద్రి వేసిన సర్ సీవిరామన్, అబ్దుల్ కలామ్ చిత్రపటాలను వీసీ ఆవిష్కరించి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత నన్నయ విగ్రహానికి, సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


రామన్ చిత్రపటానికి, నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వీసీ, అతిథులు

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామన


కామన ప్రభాకరరావు

మండపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదకు చెందిన ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావును నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండపేట ఏడిద రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని.. తనపై ఎంతో నమ్మకంతో కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలపై రాష్ట్ర పర్యటన త్వరలోనే జరుగుతుందని, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని కలిసిన తర్వాత ఉత్తరాంధ్ర నుంచి రైతు సమస్యలపై పోరాటం ఉంటుందని ఆయన చెప్పారు.

కనుల పండువగా కుక్కుటేశుని తెప్పోత్సవం

వైభవంగా శ్రీపుష్పోత్సవం, ముగిసిన కల్యాణోత్సవాలు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో హంస వాహనంపై కుక్కుటేశుని తెప్పోత్సవం, బాణసంచా కాల్పుల దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో భక్తుల శివనామస్మరణ మధ్య కుక్కుటేశుడు అమ్మవారితో కలిసి హంసవాహనంపై విహరించారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు కుక్కుటేశుని తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికంగా తరలి వచ్చారు. పాదగయలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా కుక్కుటేశ్వరస్వామికి ఉదయం స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చనలు జరిగాయి. స్వామి, అమ్మవారికి త్రిశూల స్నానం జరిపించారు. రాత్రి పదిగంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంతసేవాగానం జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా కాల్పులు

పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ కాల్చిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో రథాన్ని ఉప్పాడ సెంటర్‌లో నిలిపిన అనంతరం 4 గంటల పాటు బాణసంచా కాల్చారు. మిరుగొట్లు గొలిపే బాణసంచా కాల్పులను తిలకించేందుకు భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు.

భీమేశ్వరునికి త్రిశూల స్నాన పూజలు


పుష్కరిణిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సామర్లకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరునికి త్రిశూల స్నాన పూజలు శుక్రవారం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పండితులు సోమేశ్వరశర్మ నేతృత్వంలో చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. త్రిశూల స్నానం, తీర్థపుసేవ పూజలు నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని
ఇద్దరు యువకుల దుర్మరణం


మరణించిన ఆకాష్‌రెడ్డి, జయఅభినవ్ (ఫైల్‌ఫొటోలు)

ఐ.పోలవరం/ముమ్మిడివరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం 216 జాతీయ రహదారిపై పాతయింజరం పోలీసుస్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. యానాం నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న వారిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులిద్దరూ ముమ్మిడివరం మండలానికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి.

మృతులలో ఒకరు ముమ్మిడివరం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధికి చెందిన దొమ్మేటి జయఅభినవ్ (17) కాగా మరొకరు కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగుపేటకు చెందిన మాట్టా ఆకాష్‌రెడ్డి (21). దొమ్మేటి అచ్యుత వీరవెంకటసత్యనారాయణ-సరోజిని దంపతులకు దొమ్మేటి జయఅభినవ్ ఏకైక సంతానం. పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. లేకలేక కలిగిన సంతానం ఒక్కగానొక్క కుమారుడు. అభినవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న సంగతిని జీర్ణించుకోలేకపోతున్నారు. మట్టా రాహుల్-సుభాషిణి దంపతుల పెద్ద కుమారుడు మట్టా ఆకాష్‌రెడ్డి. డిప్లమో చేసి ప్రస్తుతం ముమ్మిడివరంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. చేతికందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురవ్వడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఐ.పోలవరం పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతదేహాలను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీసీ పుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.


రోడ్డుపై మృతదేహాలు

ధర్మవరంలో వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరానికి చెందిన రాయి నూకరాజు హైస్కూలు రోడ్డు జంక్షన్‌లో హైవే దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం ముంపు నుంచి ఆదుకోవాలి

వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం వాసుల ఆందోళన


ధవళేశ్వరం పోలవరం భూ సేకరణ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వడ్డిగూడెం వాసులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపు నుంచి ఆదుకోవాలని, తమను నిర్వాసితులుగా గుర్తించి పునరావాసం కల్పించాలని, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆందోళన చేశారు. స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళావందనంకు వినతిపత్రం అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఐఏఎస్ అధికారి వి.అభిషేక్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా వీఆర్‌పురం గ్రామం బీసీ కాలనీ వాసులమని, గత 60 ఏళ్లుగా వడ్డిగూడెం పంచాయతీలో ఇంటిపన్నులు చెల్లిస్తున్నామన్నారు. అయితే తమ ఇళ్లు ఇతర భూములు రేఖపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయంటున్న అధికారులు ఆ కారణంతో తమ కాలనీలో ఉన్న 209 కుటుంబాలను ముంపు బారిన పడుతున్నట్టు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కాలనీ పరిధిలో 209 కుటుంబాలు ఉండగా 111 కుటుంబాలు లేడార్ సర్వేలో ఉన్నాయని మిగిలిన 98 కుటుంబాలు లేడార్ సర్వే కుటుంబాల్లో లేవని అధికారులు చెబుతున్నారని అయితే గోదావరి వరదలు వస్తే మొత్తం గ్రామం అంతా మునిగిపోతుందని ఫోటోలు ప్రదర్శించారు.

రేఖపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధం లేకుండా వీఆర్‌పురం బీసీ కాలనీలో ఉన్న 209 కుటుంబాలను ఒకే యూనిట్‌గా 41.15 కాంటూరులో చేర్చి ముంపు ప్రాంతంగా గుర్తించి గ్రామసభలో తీర్మానించాలని కోరారు. స్ట్రక్చర్ వాల్యూ సర్వే చేయించాలని అధికారులను కోరారు. కాలనీలో కొంతభాగం ముంపు ప్రాంతంగా, మరికొంత భాగాన్ని ముంపు బారిన పడని ప్రాంతంగా గుర్తించడం తగదని పోలవరం పూర్తయితే శాశ్వతంగా ముంపునకు గురవుతామని ప్రభుత్వం చొరవతో పునరావాసం కల్పించాలని కోరారు.

నేటి నుంచి కొత్త మోటార్ వెహికిల్ చట్టం అమల్లోకి

లైసెన్సు లేకపోతే రూ.5వేలు

సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



శనివారం నుంచి కేంద్ర ప్రభుత్వం కొత్త మోటారు వెహికిల్ చట్టం 'న్యూ సెంట్రల్ మోటార్ వెహికిల్ యాక్ట్-1988(సవరణ 2019)' అమల్లోకి తీసుకొస్తోంది. దీని ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయి. జరిమానాలు రూ.వెయ్యి నుంచి ప్రారంభమవుతాయి. డ్రైవింగ్ లైసెన్సు రద్దుకూ వెనుకాడరు. ఇలా ఒకసారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తే మళ్లీ పునరుద్ధరించడం చాలా కష్టమైన పని. లైసెన్సు లేకపోతే రూ.5వేలు, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా విధిస్తారు. మార్చి 1 నుంచి నూతన చట్ట ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి తీరాల్సిందేనని చెప్పారు. వాహనాలను ఆల్ట్రేషన్ చేయడం, ఇష్టానుసారం నంబరు ప్లేట్లు వేసుకోవడం, అసలు నెంబరు లేకుండా పేరు రాసుకోవడం, నవ్యంగా డ్రైవింగ్ చేసే వారికి కూడా ఇబ్బంది కలిగే విధంగా, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం, నంబరు ప్లేట్లు లేకపోవడం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. హెల్మెట్ లేకపోతే చలానాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ద్విచక్రవాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, ఇద్దరికీ హెల్మెట్లు ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ సీఐలు మహమ్మద్ నబీ, చింతా సూరిబాబు సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేపడతారని చెప్పారు. కొత్త చట్ట ప్రకారం చలానాలు విధించడమే కాకుండా అక్కడికక్కడే జరిమానా కట్టించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు చిక్కుల్లో పడతారన్నారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచి విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ నుంచి తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంటకాలువకు 1720 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 4600 క్యూసెక్కులు, 8970 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8328 క్యూసెక్కులుగా ఉండగా, ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.05 అడుగులుగా నమోదైంది.

సత్యనారాయణస్వామి ఆలయంలో చోరీ

8కిలోల వెండి

ఆభరణాలు అపహరణ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సవరప్పాలెం శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో దొంగలు పడి 8 కిలోల వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఆలయ పూజారి దొంతికుర్తి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వెళ్లారు. అప్పటికే తలుపులు తెరచి ఉండడాన్ని గుర్తించి స్థానిక పెద్దలు, అధికారులకు సమాచారం అందించారు. తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, పట్టణ సీఐ వి.వీరబాబు, తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయానికి ఉన్న నాలుగు ప్రధాన ద్వారాల తాళాలను పగులకొట్టి గర్భాలయంలోని 8కిలోల వెండి ఆభరణాలను చోరులు అపహరించుకుపోయినట్టు గుర్తించారు. అప్పటికే క్యూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలిముద్రలను సేకరించారు. ఆలయం వద్ద నుంచి డాగ్‌స్క్వాడ్ కిలోమీటరు దూరంలో ఉన్న కేతావారిపాలెం వరకు వెళ్లి అక్కడ ఆగిపోయింది. ఆలయ పూజారి దొంతికుర్తి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఎవరైనా దొంగతనానికి పాల్పడ్డారా లేక బయటి నుంచి దొంగలు వచ్చారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆలయంలో మిగిలిన వెండి ఆభరణాలు, బంగారు ఆభరణాలు యథావిధిగానే ఉన్నాయని ఆలయ పూజారి, గ్రామపెద్దలు తెలిపారు.


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐలు వీరబాబు, గజేంద్రకుమార్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

దుర్గాడలో త్రిశూలేశ్వరుడి పూజలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో త్రిశూలేశ్వరుడి పూజలు శుక్రవారం జరిగాయి. స్వామి,అమ్మవార్లకు పూజా క్రతువులు నిర్వహించారు. 1100కిలోల బియ్యంతో వండిన అన్నంతో అన్నసమారాధన జరిగింది. స్వామి వారిని రజత, స్వర్ణ ఆభరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

విధుల్లో అలక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు : డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

పిఠాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల అలక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ స్పష్టం చేశారు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఎంఈవోలు, కస్టోడియన్లు, చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుకు ఓరియెంటేషన్ సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఎవ్వరిని లోపలకు అనుమతించవద్దని, ఎవ్వరి వద్ద సెల్‌ఫోన్లు ఉండకూడదని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం, ఫర్నీచర్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. టాయిలెట్లు నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి కాగితాలు ఉండకూడదని, పరీక్ష పేపర్ల కోడ్‌లు సరిగా చూడాలని తెలిపారు. పరీక్షల ఆసిస్టెంట్ కమిషనరు రాజశేఖర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో గతానికి ఇప్పటికి వచ్చిన మార్పులను గమనించాలన్నారు. రంజాన్ సెలవుకు అనుగుణంగా సోషల్ పరీక్ష ఉంటుందని తెలిపారు. డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, పెద్దాపురం డీవైఈవో ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజప్ప


లోకేశ్‌తో రాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం బడ్జెట్ సమావేశాలకు ముందుగా అసెంబ్లీ ఆవరణలో మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బడ్జెట్‌లో అన్నిరంగాల అభివృద్ధికి సమతూకంలో నిధులు కేటాయించేలా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారని మంత్రి నారా లోకేశ్‌తో చర్చించారు.

క్రీడాకారులకు అభినందన

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన ఏపీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. మార్చి 16 నుంచి 23 వరకు గోవాలో జరిగే మాస్టర్స్ జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్రి భామిరెడ్డి, శారదా దేవి, గోవిందురాజు, కృష్ణమూర్తి, ప్రసాద్‌వర్మ, సత్యప్రసాద్ ఉన్నారు.

'వంకర పాదాలను నిర్లక్ష్యం చేయొద్దు'

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వంకర పాదాలతో పుట్టిన చిన్నారులకు ఎటువంటి శస్త్రచికిత్స లేకుండా సరిచేస్తున్న క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా సంస్థ చేస్తున్న సేవలను ఆ సంస్థ ప్రతినిధి అమెరికాకు చెందిన డాక్టర్ బ్రూస్ స్మిత్ కొనియాడారు. కాకినాడ జీజీహెచ్‌లో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ పర్యవేక్షణలో ఆర్థో విభాగంలోని సెమినార్ హాల్లో వంకర పాదాలతో పుట్టిన చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులతో క్లబ్‌ఫుట్ చిల్డ్రన్స్ సమావేశం నిర్వహించారు. డాక్టర్ బ్రూస్ స్మిత్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చిన వంకర పాదాలను నిర్లక్ష్యం చేస్తే చంటి బిడ్డల భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. క్లబ్‌ఫుట్ అందిస్తున్న సేవల్లో క్రమం తప్పకుండా చికిత్స అందితే పాదాలు సాధారణ స్థితికి వస్తాయన్నారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే శస్త్రచికిత్స అవసరమౌతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలమంది చిన్నారులకు క్లబ్‌ఫుట్ ఉచితంగా సేవలు అందిస్తోందన్నారు. డాక్టర్ విఠల్ మాట్లాడుతూ ఏడేళ్లుగా క్యూర్ ఇండియా స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో వేలాదిమంది వంకర పాదాల చిన్నారులకు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో ఉచిత సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్థో ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారఽధి, డాక్టర్ ముఖర్జీ, ఆర్థో పీజీలు క్యూర్ ఇండియా స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ శిరీష, జిల్లా ప్రోగ్రామ్ సమన్వయకర్త కిరణ్‌రాయ్,సిబ్బంది ఉన్నారు.

బడ్జెట్‌పై... నాయకుల మాట

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టింది. దీనిపై పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

సూపర్ బడ్జెట్



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇది కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ బడ్జెట్. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుచూపుతో బడ్జెట్‌ను రూపొందించారు. రూ.3,20,359 కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో అన్ని శాఖలకు పెద్ద మొత్తాల్లో కేటాయింపులు జరిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలులో భాగంగా తల్లికి వందనం కోసం రూ.9,400కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,300 కోట్లు, ఎన్టీఆర్ పెన్షన్‌లకు రూ.27,150కోట్లు కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిచ్చారు.

- చిక్కాల రామచంద్రరావు, మాజీ మంత్రి

ప్రజలపై అదనపు భారాలు



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా ప్రజలపై అదనపు భారాలు మోపింది. విద్య, వైద్య సామాజిక రంగాలపై దృష్టిలేదు. గత బడ్జెట్ కంటే 2శాతం మాత్రమే ఎక్కువ కేటాయించింది. నేడు పెరిగిన ధరలతో పోలిస్తే ఈ బడ్జెట్‌లో సామాజిక రంగాలకు న్యాయం జరగలేదు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు సరిగాలేదు. కౌలు రైతులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. కేంద్రంనుంచి రావాల్సిన నిధుల ఊసే లేదు. ఈ బడ్జెట్ పూర్తిగా వ్యవసాయ వ్యతిరేక బడ్జెట్.

-తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ప్రజా సంక్షేమానికి తోడ్పడని బడ్జెట్



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రూ.3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు. మరో రూ.80వేలకోట్లు ద్రవ్య లోటును పూడ్చుకోవడానికి ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉంది. పన్ను ఆదాయం రూ.14వేల కోట్లు పన్నేతర ఆదాయం రూ.12 వేలకోట్లు పెంచి చూపడం ప్రజలపై భారాలు వేసేందుకు సంకేతం. అనుకున్న ఆదాయం రాలేదంటూ పథకాల్లో కోత పెట్టే ప్రమాదముంది. మేనిఫెస్టోలో యువతకు నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు.

-కరణం ప్రసాదరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

అన్నివర్గాలకు వెన్నుదన్నుగా బడ్జెట్ : వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాలకు వెన్నుదన్నుగా రాష్ట్ర బడ్జెట్ ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, వెనుకబడిన, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అధికంగా నిధులు కేటాయించారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు నిధులు కేటాయించడం ద్వారా వాటిని అమలు చేయనున్నట్టు బడ్జెట్ ద్వారా తెలియజేశారన్నారు. సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు నిధులు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వహయాంలో నిధులు ఇచ్చిన ఈ ప్రాజెక్టును సైకో జగన్ నిలిపివేశారని విమర్శించారు. రాష్ట్రం అన్నిరంగాల్లో ముందడగు వేస్తుందని ఈ బడ్జెట్ ద్వారా భరోసా ఇచ్చారని తెలిపారు.


పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ ఉమర్ ఆలీషా


ఉమర్ ఆలీషా విగ్రహానికి నివాళి దృశ్యం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ కవిశేఖర ఉమర్ ఆలీషా అని, తన ఆధ్యాత్మిక జ్ఞాన బోధనలతో లక్షల మంది శిష్యులను తయారు చేశారని, స్త్రీల విద్య, సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం విశేష కృషిచేశారని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం డాక్టర్ ఉమర్ ఆలీషా సోదరుడు అహ్మద్ ఆలీషా, హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక బోట్‌క్లబ్ వద్ద శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం కాకినాడ శాఖ కన్వీనర్ పేరూరి సూరిబాబు ఆధ్వర్యంలో 140వ కవి రాజశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 140వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రభోదించి, దేశ సమగ్రతకు, విశ్వ మానవ శాంతికి ఉమర్ ఆలీషా పాటుపడ్డారన్నారు. ఎంపీగా, పీఠాధిపతిగా, అష్టావధానిగా, బహుగ్రంథకర్తగా, సామాజిక వక్తగా స్వాతంత్రోద్యమాల్లో ప్రసంగాలు చేశారన్నారు. సుమారు 50 గ్రంథాలను రచించిన గొప్ప సాహితీవేత్త అని కొనియాడారు. ధాన్యం కుచ్చులు పంపిణీ చేశారు. మండా ఎల్లమాంబ, కాకినాడ లక్ష్మి, రెడ్డి సూర్యప్రభావతి, వనుం మణి, బాదం లక్ష్మీకుమారి, కె వీరభద్రరావు, రెహ్మాన్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి సాంస్కృతిక, క్రీడా పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎపెక్స్ స్కూల్ చర్చి స్క్వేర్ జగన్నాథపురంలో ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా స్థాయి బాల బాలికలకు అన్ని విభాగాల్లో భరత నాట్యం, కూచిపూడి, డప డాన్స్, చెక్క భజన, కోలాటం, మార్షల్ ఆర్ట్స్ కూస్, సిలంభం(కర్రసాము) తదితర సాంస్కృతిక కళల్లో ఆటల పోటీలు జిల్లాస్థాయిలో నిర్వహిస్తారని ఎపెక్స్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ బేగ్ తెలిపారు. పోటీల్లో ఎంపికైనవారు ఈనెల 9న గుంటూరు స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సారస్వతిక పోటీల్లో పాల్గొంటారని జిల్లా సాంస్కృతిక పోటీల అధ్యక్షుడు బొజ్జ శరత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ట్రోఫిర్ల్ షిప్పింగ్ కంపెనీ అధినేత చిన్నమరియల పెమ్మాడ శ్రీనివాస్‌కుమార్, జిల్లా కార్యదర్శి బచ్చు రాజేష్‌కుమార్, స్టేట్ కోఆర్డినేటర్ బచ్చు చంద్రశేఖర్ పాల్గొంటారన్నారు. వివరాలకు 9396265791, 8639795007 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అనధికారిక లేఅవుట్లపై చర్యలేవి?


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికారిక లేఅవుట్లు పెరిగిపోతున్నా వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షత వహించారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు గుళ్ల సుబ్బారావు, గంటా అప్పలస్వామి మాట్లాడుతూ అనుమతులు లేకుండా పట్టణంలో లేఅవుట్లు వేస్తున్నారని, వాటిని నిరోధించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అదే విధంగా ప్లానుల అప్రూవల్‌కు లంచాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారి దీప్తి మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్ల వివరాలు కౌన్సిల్‌కు ఇస్తామని తెలిపారు. తాము ఎవరిని సొమ్ములు అడగడం లేదని స్పష్టం చేశారు. కమిషనరు కనకారావు మాట్లాడుతూ అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించి నోటీసు ఇవ్వడంతో పాటు అక్కడ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్లానులు కోసం ఎవరిని ఆశ్రయించవద్దని, ఎల్‌టీపీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామని తెలిపారు. నగరపంచాయతీ పారిశుధ్య విభాగానికి చెందిన పరికరాలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయని, వాటి విలువ లేకుండా అజెండా తయారు చేయడాన్ని వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి, ఇతర కౌన్సిలర్లు ప్రశ్నించారు. నగర పంచాయతీ కాంప్లెక్సును పలువురు అనధికారికంగా వినియోగించుకుంటున్నారని, వారిని తక్షణం ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశం గురించి ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవు

డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశానుసారం పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయడంతోపాటు తప్పనిసరిగా జిల్లా అప్రాప్రియేట్ అథారిటీలో నమోదై సంబంధిత ఆస్పత్రులు చట్టంలోని సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. లేకపోతే నిర్వాహకులకు జరిమానాతోపాటు జైలుశిక్ష విధిస్తారన్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ కాకుండా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ 1800-425-3365లో తెలియజేయాలన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి : ఎంఈవో

తాళ్లరేవు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందుపుచ్చుకోవాలని ఎంఈవో ఎ.మంగాయమ్మ అన్నారు. శుక్రవారం సుంకరపాలెం నల్లం రెసిడెన్షియల్ హైస్కూల్లో నేషనల్ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సైన్స్ ప్రాజెక్టులను ఎంఈవో ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన 130ప్రాజెక్టును ఎంఈవో పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలు విద్యార్థులు వివరించారు. స్కూల్ చైర్మన్ నల్లం నాగబాబు, ప్రధానోపాధ్యాయుడు డి.సుబ్బారావు, గ్రాంటు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశి రవీంద్ర, సైన్స్ ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సుభాష్, విజయకుమార్ పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో సైన్స్ దినోత్సవం


పెద్దాపురం: శ్రీప్రకాష్‌లో సర్ సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రామారావుపేటలో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అకడమిక్ కోఆర్డినేటర్ అసిత్ కుమార్ రాయ్ సర్ సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాటాడుతూ సైన్సు దైనందిన జీవితంలో ఒక భాగంగా మారి చాలా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సీవీ రామన్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రయోగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రశాంతి, ఉషాచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

సామర్లకోట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ.రామన్ నోబెల్ బహుమతి పొందిన రోజున జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమని ప్రతిభ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్వీవీజీ. ప్రకాష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం విద్యాసంస్థల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రకాష్ ప్రారంభించారు. 170 అంశాలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. లయన్స్ ప్రతినిధి సుధారాణీప్రకాష్, టి.సునీత, పి.శ్రీగౌరి తదితర అధ్యాపకబృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తపల్లి శివాలయం వద్ద భారీ అన్నసమారాధన

కొత్తపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కొత్తపల్లిలో శ్రీబాలాత్రిపురం సుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక రైతు నాయకుడు జ్యోతుల అర్జారావు కుమారులు ఆధ్వర్యంలో నిర్వహించిన మండలంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

డ్వాక్రా సంఘాల పనితీరు మరింత మెరుగుపడాలి

సామర్లకోట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలు పుస్తక నిర్వహణ, కట్టుబాట్లు, రుణ చెల్లింపులు, పొదుపు పాటించడం వంటి అంశాలలో మరింత మెరుగుపడాలని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ అధికారిణి ప్రియంవద పేర్కొన్నారు. సామర్లకోట మెప్మా కార్యాలయంలో శుక్రవారం మెప్మా సిబ్బందికి, మహిళా సంఘాల సీఆర్పీలకు సమీక్షా సమావేశం మెప్మా సీఎంఎం సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. మహిళా సంఘాలు తయారుచేసిన ఉత్పత్తుల విక్రయాలకు ఏర్పాటుచేస్తున్న స్టాల్స్ మొక్కుబడిగా కాకుండా పూర్తి ఆదాయవనరులను అర్జించే రీతిలో ఉండాలని సూచించారు. బయట వ్యక్తులు తయారుచేసిన ఆహార పదార్థాలను ఎంతమాత్రం మెప్మా మార్కెట్ స్టాల్స్‌లు విక్రయించరాదన్నారు. సేవారంగ కార్మికులు ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, బ్యూటీషియన్లకు శిక్షణా తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు. గృహనిర్మాణరుణాల తిరిగి చెల్లింపుల్లో బకాయిలు సత్వరం వసూలు చేయాలని పీడీ ప్రియంవద అన్నారు. ఈసమీక్షలో ప్రసాదబాబు, బి.వెంకటలక్ష్మి, డీఈవో ఎం.రామోజీ, ఆర్పీలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 23మందికి కాకినాడ మూడో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎన్.రమేష్ డి.రామారావు తమ బృందాలతో గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 23మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒకరికి ఆరు రోజుల జైలు శిక్ష, మరో 13మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, 9మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

పంటపొలాల మధ్య ఆక్వా సాగుపై రైతుల నిరసన


తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కరప, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పంటపొలాల మధ్య ఆక్వా సాగు చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు రైతులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కరప పరిధిలోని వెంకటప్పయ్య డ్రైన్‌కు చేర్చి పదెకరాల వ్యవసాయభూమిని నాలుగేళ్లక్రితం ఆక్వా సాగు కోసం చెరువులుగా మార్చారు. అయితే అప్పట్లో పలువురు రైతులు దీనిపై అభ్యంతరం తెలపడంతో లీజుదారుడు వాటిని వదిలి వెళ్లిపోయాడు. ఇప్పుడు మరో లీజుదారుడు ఆక్వా సాగు చేయడానికి భూయజమానితో ఒప్పందం చేసుకుని ఆ చెరువుల్లో నీరుపెడుతుండడంతో చుట్టుపక్కల రైతులు ఆందోళనకు దిగారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన రైతులు తాజాగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంట పొలాల నడుమ ఆక్వా సాగు చేపడితే చుట్టుపక్కల వ్యవసాయభూములు చౌడుబారిపోయి సాగుకు పనికిరావన్నారు. అధికారులు స్పందించి ఆక్వా సాగును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా నీటి సంఘాల మాజీ డైరెక్టర్లు నూకల సూర్యనారాయణ, చోడపునీడి గోవిందరాజులు, అనిశెట్టి సత్తిబాబు, రైతులు చిన్నారి శ్రీనివాస్, వీరభద్రరావు, గంటయ్య, పేకేటి గాంధీ పాల్గొన్నారు.

భువనేశ్వరీ పీఠాధిపతి గోపీశర్మ జన్మదిన వేడుకలు

పెద్దాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వర్ధులవారి వీధిలో ఉన్న భువనేశ్వరీ పీఠం పీఠాధిపతి చింతా గోపీశర్మ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. పలువురు ప్రముఖులు, శిష్యులు పీఠానికి వచ్చి ఆయన ఆశీస్సులు పొందారు. అలాగే భువనేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను, అభిషేకాలు నిర్వహించారు. పీఠంలో ప్రసాద వితరణ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోపీశర్మ సిద్ధాంతిని శిష్య బృందం పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించింది.

ఆకట్టుకున్న 'రవీంద్రభారతి' సైన్స్ ఎక్స్‌పో

కాకినాడసిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విజ్ఞానశాస్త్రంలోని వివిధ అంశాలను నమూనాల రూపంలో ప్రదర్శిస్తూ జగన్నాథపురంలోని రవీంద్ర భారతి పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఎక్స్‌పో సంబరాలు నిర్వహించారు. ఈఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుల నమూనాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా రైల్వే లోకో పైలెట్ వీరబ్రహ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు.

జయలక్ష్మి డాక్యుమెంట్ల నెంబర్ల సవరణ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ కేంద్రంగా నడిచిన జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీకి చెందిన డాక్యుమెంట్ల నెంబర్లను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023లో అమెండ్‌మెంట్ చేసిన డాక్యుమెంట్లకు సంబంధించిన నెంబర్లను సవరించింది. 2022లో ఈసంస్థలో వందల కోట్ల రూపాయల అవకతవకలు జరిగి నిధులు దుర్వినియోగం కావడం.. యాజమాన్యంపై కేసులు నమోదు కావడం.. ఆర్థిక లావాదేవీలు నిలిచిపోవడం తెలిసిందే. యజమానుల్లో పలువురు ఇప్పటికే అరెస్టయ్యారు. బాధితుల పోరాటంతో పలు ఆస్తులను కూడా సీజ్‌చేసిన విషయం తెలిసిందే.

కార్నియాలు సేకరణలో ధూళిపూడి ప్రథమం

తాళ్లరేవు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్నియాల సేకరణలో తాళ్లరేవు లయన్స్‌క్లబ్ సభ్యుడు ధూళిపూడి వెంకటరమణ ప్రథమస్థానంలో నిలిచారని లయన్స్ జిల్లా ద్వితీయ గవర్నర్ చట్నీడి శీనివాస్ అన్నారు. శుక్రవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంధులకు కంటిచూపు ఇవ్వడంలో జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచారన్నారు.

కందరాడ వీఆర్వోకు ఊరట

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కందరాడ విలేజ్ రెవెన్యూ అధికారిగా పని చేసి సీనియర్ అసిస్టెంట్ హోదాలో ఉద్యోగ విరమణ చేసిన పీవీఎస్ఎస్ఎస్ మూర్తిపై తదుపరి విచారణను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలివి. కందరాడ వీఆర్వోగా విధి నిర్వహణలో ఉన్నప్పుడు రైతులకు చెల్లించాల్సిన రూ.లక్షా10వేల ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు 2013లో మూర్తిపై అభియోగం నమోదైంది. విచారణలో నిరూపితం కాకపోవడంతో తదుపరి చర్యలను నిలిపివేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌పై రాళ్లదాడి

అద్దాలు ధ్వంసం

పిఠాపురం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణం ఇందిరానగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ భవనంపై రాళ్ల దాడి జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఆగంతకులు రాళ్లతో హెల్త్ సెంటర్ కిటికీల అద్దాలు, ఇతర గ్లాసులను పగలగొట్టారు. సంఘటన జరిగిన సమయంలో సిబ్బంది ఎవరు లేరు. పగిలిన గ్లాసులు అన్ని చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని ఉదయం విధుల్లోకి వచ్చిన సిబ్బంది గుర్తించారు. జరిగిన సంఘటనపై వైద్యాధికారిజయరామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, వారిని అన్నివిధాలా ఆదుకుంటుందని కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోజయంతి సందర్భంగా అన్నదాన సమాజంలో టైలర్స్‌డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

సర్పవరం జంక్షన్‌లో హెచ్‌టీ కేబుల్ దగ్ధం


తహశీల్దార్ కార్యాలయ సమీపంలో హెచ్‌టీ కేబుల్‌లో మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో అండర్ డ్రైనేజీలో వేసిన హైటెన్షన్ (హెచ్‌టీ) కేబుల్‌లో శుక్రవారం ఆకస్మికంగా మంటలు సంభవించడంతో హెచ్‌టీ కేబుల్ దగ్ధమైంది. తహశీల్దార్ కార్యాలయం వివిధ పనుల కోసం వచ్చే సందర్శకుల రద్దీతో ఉంటుంది. ఈక్రమంలో మధ్యాహ్నం అకస్మాత్తుగా హెచ్‌టీ కేబుల్ నుంచి మంటలు రావడంతో ప్రయాణికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. హెచ్‌టీ లైన్ మంటలకు ఆహుతి కావడంతో విద్యుత్తుశాఖ ఏఈ గౌతురాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్‌సిబ్బందితో వచ్చి మంటలను నియంత్రించారు. ఈసందర్భంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా విద్యుతు సరఫరా చేసినట్లు ఏఈ గౌతు రాజు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని, షార్ట్ సర్క్యూట్‌తో ఈప్రమాదం సంభవించి ఉంటుందని అంటున్నారు.

'భారతదేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలి'

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలని అక్నూ గణిత ప్రొఫెసర్ డాక్టర్ టి.హైమావతి అన్నారు. జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని జేఎన్టీయూకే, యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో బీటెక్ విద్యార్థులకు వికసిత్ భారత్ కోసం సైన్స్, ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత కల్పించేందుకు వైస్ ప్రిన్సిపాల్ స్వరూపారాణి అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ టి.హైమావతి, అతిథిగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు. హైమావతి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా కాకుండా అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రమణాజీ, కిరణ్మయి, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ పనుల తనిఖీల్లో భాగంగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. మెయిన్‌రోడ్డు పాత విజయలక్ష్మి ఆస్పత్రి రోడ్డు, రాఘవేంద్ర స్వామి గుడి వీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైన్ల పరిశుభ్రత, చెత్త సేకరణ వంటి విషయాలపై ఆరా తీశారు.

గొల్లప్రోలులో టైలర్స్ డే

గొల్లప్రోలు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో శుక్రవారం టైలర్స్ డే నిర్వహించారు. జై గణేశా టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు అందజేశారు.

'ఆదిత్య'లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గండేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో క్రికెట్ టోర్నమెంటును డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దాదాపు వందకి పైగా టీములు హాజరయ్యాయి. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.రవి పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక




ఒడిశాలోని మల్కనగిరి జిల్లా మోటులో నిర్వహించిన పోలవరం నిరసన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ప్రదీప్ మాంజీ. పక్క చిత్రంలో హాజరైన పోలవరం ముంపు నిర్వాసితులు

'పోలవరం మాకు...వద్దు'

చింతూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం వద్దు అంటూ సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాలోని మల్కనగిరి జిల్లా మోటులో శుక్రవారం నిరసన సభ జరిగింది. ఈ సభకు ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పలు పార్టీల నాయకులు, నిర్వాసితులు హాజరయ్యారు. సభల్లో పాల్గొన్న ఒడిశాకు చెందిన మాజీ ఎంపీలు ప్రదీప్ మాంజీ, మున్నాఖాన్, మాజీ మంత్రి పద్మినిధ్యాన్, తెలంగాణకు చెందిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్యదొర తదితరులు మాట్లాడారు. తొలుత భువనేశ్వర్ నుంచి ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ లైవ్ స్ర్కీన్‌లో మాట్లాడుతూ పోలవరంతో తలెత్తుతున్న నష్టాన్ని వివరించడంతోపాటు తమ ప్రభుత్వం పోలవరం వద్దు అంటూ కేంద్రంపై తీసుకొచ్చిన ఒత్తిడి తీరుని వివరించారు. అనంతరం మిగిలిన వక్తలు మాట్లాడుతూ పోలవరంతో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఆదివాసీ గ్రామాలు నీటమునగనున్నా యన్నారు. దీంతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. పోలవరంతో ఒడిశాలో 12 ఆదివాసీ గ్రామాలు జలమయం కానున్నాయన్నారు. ఇదేమి పరిగణనలోకి తీసుకోకుండానే ఏపీ ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణానికే మొగ్గు చూపుతోందన్నారు. ఇప్పటికే పోలవరం వద్దు అన్న నినాదంతో పలు ఉద్యమాలు చేపట్టినట్టు వారు తెలిపారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం పోలవరం నిర్మాణం నిలిపివేయాలని లేనిపక్షంలో ఆదివాసీలంతా ఏకమై తిరుగుబాటు చేయడం ఖాయమన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలలో పలు గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉన్నప్పటికీ నష్టం భర్తీ చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమని వారన్నారు. కేంద్రం ముంపు, నష్టపరిహారంపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ మనోజ్ మడకామి, కోరాపుట్ పీసీసీ అధ్యక్షుడు ఈశ్వరపాణిగ్రహి, మల్కనగిరి ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు రమేష్‌చంద్ర, జేకే సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగిలో ప్రయాణీకుల సౌకర్యార్థం తక్షణం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు డిమాండ్ చేశారు. రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్ బస్టాండ్ వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని తహశీల్దార్ అల్లు సత్యనారాయణకు గిరిజన సంఘం, ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బస్ షెల్టర్ తొలగించారన్నారు. టాయిలెట్స్ సదుపాయం లేక మహిళా ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నిర్వాసితుల కొంపముంచిన గత ప్రభుత్వం

• 2022లో జరిగిన సర్వేలో అర్హులకు మొండిచేయి

• కూనవరం మేజర్ పంచాయతీలో ఇన్ ఎలిజిబుల్‌లో 182 కుటుంబాలు



నిర్వాసితుల ఇంటిని కొలతలు వేస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

కూనవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నీళ్లు ఊరిలోకి రాకముందే గత ప్రభుత్వం నిర్వాసితుల కొంప ముంచింది. ఇష్టానుసారంగా సర్వేలు నిర్వహించి అర్హుల పేర్లు జాబితాలో గల్లంతయ్యేలా చేసింది. 2022లో నిర్వహించిన ఈ సర్వే తాజాగా ఇప్పుడు అధికారులు విడుదల చేయడంతో అర్హులైన పోలవరం నిర్వాసితులు తమ పేర్లు లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. మండలంలో మొదటి ప్రాధాన్య ముంపు గ్రామాలుగా తొమ్మిది గ్రామాలను గుర్తించారు. అందులో కూనవరం మేజర్ పంచాయతీ ఒకటి. ఈ పంచాయతీ పరిధిలో భారీగానే పేర్లు గల్లంతయ్యాయి. పంచాయతీ పరిధిలో ఉన్న కూనవరం గ్రామంలో 95 కుటుంబాలు, టేకులబోరులో 87 కుటుంబాలు ఇన్ ఎలిజబుల్‌లో ఉంచారు. మరికొంత మంది ఇక్కడే ఉంటున్న వారిపేర్లు కూడా జాబితాలో లేవు. ఇక్కడే పుట్టి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఇల్లు కలిగి ఉండి ఉపాధి కోసం వేరే ఊరు వెళ్లిన పేర్లు తొలగించారు. ఈ జాబితాలో పెళ్లైన యువత కుటుంబాలు ఎక్కువగా ఉన్నా రు. ఇటువంటి వారు సుమారు వందకిపై కుటుంబాలు ఉన్నాయి. దీంతో వీరు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి సంబంధించి తమ పేర్లు వచ్చాయని ఆర్అండ్ఆర్ జాబితాలో తమ పేర్లు తొలగించారని వారు అంటున్నారు. అర్హులైన వారికి రాకుండా వేరే ప్రాంతంలో ఉంటూ అర్హులు కాని వారి పేర్లు వచ్చాయని విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఎవరూ ఆందోళన చెందవద్దని పోలవరం అధికారులు అంటున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందుతుందన్నారు. గ్రామసభలు నిర్వహించి నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి జాబితాలో చేరుస్తామని పోలవరం అధికారులు తెలిపారు.

కాపుగొంపల్లిలో మంచినీటి బోరు ఏర్పాటు

ఎటపాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం గన్నవరం పంచాయతీలోని కాపుగొంపల్లి గ్రామంలో శుక్రవారం జామాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడిపై ఇటీవల కాపుగొంపల్లి వాసులు జేకేసీటి చైర్మన్ జామాల్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.50 వేల విలువైన మంచినీటి బోరును వేయించడంతో గ్రామంలో మంచినీటి ఎద్దటి సమస్య తీరింది. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొల్లా పుల్లయ్య, దానే రాజు, కణితిమధు, గ్రామస్తులు పాయంమాధవరావు, మండలపు సత్యనారాయణ, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న బొల్లా పుల్లయ్య

పోలవరం గ్రామసభలు వాయిదా

చింతూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం భూసేకరణ, ఆర్అండ్ఆర్ గ్రామసభలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. ముందుగా ప్రకటించిన మేరకు మార్చి 1 నుంచి 3 వరకు చింతూరు డివిజను పరిధి ముంపు గ్రామాలలో గ్రామసభలు జరగాల్సి ఉంది. శుక్రవారం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు పరిపాలనా అధికారి అభిషేక్ ఒక ప్రకటన విడుదల చేశారు. అనివార్య కారణాలతో సభలు వాయిదా వేశామని ఆ ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, డీఈఈలు పి.వెంకటరమణ, చైతన్య, నాగరాజు, గౌతమి, శివ, అసిస్టెంట్ ఇంజనీర్లు సత్యనారాయణ, భాను పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేట డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఏలేశ్వరం సత్యనారాయణ స్కూలులో...

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జగ్గంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని భాష్యం స్కూల్లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. మంచి ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు సత్యకుమార్, కొండబాబు, రవికుమార్, ప్రసాద్, మనీషా, మౌనిక తదితరులు పాల్గొన్నారు శ్రీచైతన్య స్కూల్లో జరిగిన సైన్స్ డేకు జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, శ్రీచైతన్య జోనల్ ఏజీఎం ఎంవీ సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రాజెక్టుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఆర్ఐ శ్రీనివాస్, శ్రీచైతన్య ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, డీన్ నాగేంద్ర, సి-బ్యాచ్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్, ఏవో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు నేతృత్వంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంఘిక గురుకుల జూనియర్ కళాశాల అధ్యాపకులు వరలక్ష్మి, రజని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడు గోపాలకృష్ణ, రసాయన శాస్త్ర అధ్యాపకుడు వారణాసి బాలరాజు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు. జగ్గంపేట శ్రీప్రజ్ఞ పాఠశాల ఆవరణలో వైజ్ఞానిక ప్రదర్శనను ముఖ్య అతిథిగా హాజరైన జేవీఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు ప్రారంభించారు. ప్రదర్శనలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత పెంపొందిస్తాయని చైర్మన్ బండారు నాగబాబు తెలిపారు. డైరెక్టర్లు మట్టే శ్రీనివాసరావు, బండారు శ్వేత, ప్రధానోపాధ్యాయురాలు సోఫియా, ప్రిన్సిపాల్ అభి, ఇన్‌చార్జి కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తుని స్పేసెస్ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణ, సృజనాత్మకత విద్యార్థులకు అసలైన సంపదలని డాక్టర్ విజయ్ విఠల్ మాతాడ్ స్పష్టం చేశారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. సైక్విస్ట్ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, క్రామన్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)కు చెందిన డాక్టర్ విజయ్ మెట్టల్, టి.మతాడ్, ఆంధ్ర విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బట్టీ పట్టే విధానం కాకుండా మేథోపరమైన చదువు ద్వారానే విద్యార్థులు మంచి పురోగతి సాధించగలరని తెలిపారు. సుమారు మూడు వేల మంది విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, క్విజ్, సైన్స్ సబ్జెక్టులపై పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి నరేంద్ర బాబు, ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణా రెడ్డి, డైరెక్టర్ హెచ్ఆర్ బంగార్రాజు పాల్గొన్నారు.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానం లేని జీవితాన్ని ఊహించలేమని శారద విద్యాలయం కరస్పాండెంట్ కృష్ణవర్మ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ బోనగిరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిలకించారు. సెయింట్‌మేరీస్ స్కూల్లో విద్యార్థుల ప్రదర్శనలను ఎస్ఐ హరిబాబు చూసి అభినందించారు. కరస్పాండెంట్ కె.సూర్య, నరాల శ్రీనివాసరావు, బర్ల లోవరాజు, పదిలం బెనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసత్యనారాయణ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఆగ్జీలియం పాఠశాలలో కరస్పాండెంట్ పైలరాణాప్రతాప్ సీవీ రామన్ చేసిన పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. స్పార్క్ సంస్థ చైర్మన్ సాయి సందీప్‌ను విద్యార్థులు సత్కరించారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య డిగ్రీ కళాశాల ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.మురళీధర్, రాజమహేంద్రవరం ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సరళ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు సీన్ సిమ్యులేషన్, పెయింటింగ్, ఫోరెన్సిక్, క్విజ్ పోటీలు, ఫ్యాషన్ షో నిర్వహించారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): స్థానిక మినర్వా విద్యా సంస్థల్లో సీవీ రామన్ చిత్రపటాలకు అధినేతలు ముత్యాల మురళీకృష్ణ, ఆర్‌బీ చౌదరి, ఫౌండర్ డీవీఎస్ రాజు రమేష్, హెచ్ఎం మల్లికార్జున్ పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అఖిల్ విద్యా సంస్థల్లో కరస్పాండెంట్ ఇనకోటి సుజాత, చైర్మన్ ఇనకోటి గంగాధర్‌లు సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది కాశీప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట రిఫరల్ పాఠశాలలో చిన్నారుల సైన్స్ ప్రాజెక్టులను చైర్మన్ ఎన్.స్లెస్సర్‌బాబు, ఎస్‌బీఐ కత్తిపూడి బ్రాంచి మేనేజరు కేజే సత్యనారాయణ చూసి అభినందించారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ పుష్పమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను, దైనందిన జీవితంలో సైన్స్ ఆవశ్యకతను ఆయన వివరించారు. విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. విజేతలకు ఎస్ఎంసీ చైర్మన్ బి.రాంబాబు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. యంగ్ సైంటిస్టులకు సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీదేవి, జయ బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.



శంఖవరం మండలం సీతంపేటలో...



అన్నవరం శారదా విద్యాలయంలో చిన్నారుల ప్రాజెక్టులు



ప్రత్తిపాడు మినర్వా స్కూలులో...



మంత్రి లోకేశ్‌కి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సమస్యల పరిష్కారానికి మంత్రులకు వినతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనితలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా కోరారు. శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం ఆమె వారిని కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. వివిధ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, అదనపు గదులు, ప్రహరీ నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని లోకేశ్‌ను కోరారు. పోలీసులకు అవసరమైన వాహనాలు, పోలీస్‌స్టేషన్లకు అదనపు భవనాల నిర్మాణం, నూతన భవనాలు ఏర్పాటు చేయాలని హోం మంత్రిని కోరారు.

పీఎంపీలకు అవగాహన

జగ్గంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీఖానాలో పీఎంపీలకు అవ గాహన సదస్సును జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు నూరుద్దీన్ బాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ బలభద్ర వెంకటరాజు మాట్లాడుతూ మెదడు సంబంధ వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించగలిగితే చికిత్స అందించడం సులభమన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బలభద్ర రఘువీర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు టీఎస్ఎన్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎండీ తానీషా, మండల కార్యదర్శి జగతా బాబ్జీ, కోశాధికారి ఎ.రమణ, దొడ్డి సుబ్బారావు, కుమార్, రాఘవ, వలీషా, కె.కృష్ణ, వీవీఎస్ మూర్తి, మారుతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

ప్రత్యంగిర హోమం

అన్నవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యంగిర హోమం ఘనంగా జరిగింది. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శంఖవరం, ఏలేశ్వరంలో టైలర్స్ డే





శంఖవరం, ఏలేశ్వరంల్లో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

శంఖవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్ హో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. శివదుర్గా టైలర్స్ యూనియన్, వర్కర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మేడిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు, బొండాడ జగదీష్, పగడాల మోహనసన్యాసిరావు, శ్రీకాకోళపు రమణ, యండమూరి శ్రీధర్‌బాబు, నక్కా విష్ణు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హో చిత్రపటానికి శ్రీసాయి టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మచ్చా నాగేశ్వరరావు, బాబి, కోరాడ రాజు, ఆకుల హేమసుందరావు, జీఎస్ రావు, టీఎస్ నారాయణ, బట్టా మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా గానాల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ధర్నాలకోట వీరబాబు, కార్యదర్శిగా ధర్నాలకోట కన్నాబత్తుడు, సహాయ కార్యదర్శిగా ఎ.రమణ, కోశాధికారిగా కృష్ణవరపు శివ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా క్రమశిక్షణా కమిటీ వైస్ చైర్మన్ ధర్నాలకోట శ్రీను, మద్దాల చిట్టిబాబు, సింహాద్రి వెంకట్రావు, ధర్నాలకోట గోపయ్య, గుండుమళ్ళ చిట్టియ్య, దవరపిల్లి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేలా బడ్జెట్

జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్



జగ్గంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేలా ఉంది. విద్య, మున్సిపాలిటీ, తెలుగు భాషాభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మద్యం వినియోగం తగ్గేలా మద్యపాన వ్యతిరేక ప్రచారం కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయం. సంక్షేమం, అభివృద్ధిలకు ప్రాధాన్యమిస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ 2047 లక్ష్యాన్ని సాధించేలా వుంది.

శివాలయం ఆధునికీకరణ పనులకు శ్రీకారం

కిర్లంపూడి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడలో శ్రీవీరబ్రహ్మానం ద బిందు ఆశ్రమంలో అష్టదళ పద్మ శివాలయం ఆధునికీకరణ పనులకు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. వాస్తురీత్యా ఉత్తర దిక్కు ప్రహరీతో పాటు ఆలయం లోపల నూతన పనులు చేపడతామని సర్పంచ్ తోట అయ్యన్న, గంధం బాబీ, తోట రామగోపాలకృష్ణ, బదిరెడ్డి మోహన్ తెలిపారు.

రక్తదానం చేయండి... ప్రాణాలను కాపాడండి

రౌతులపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడదామని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు వి.విజయ్, వివేక్ పిలుపునిచ్చారు. రౌతులపూడిలోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో సంస్థ ఆరో వార్షికోత్సవం నిర్వహించి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 42 మంది రక్తదానం చేసినట్టు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు రామకృష్ణ, సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. రెండుచోట్లా 540 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తామని చీఫ్ సూపరింటెండెంట్లు కర్రోతు బాబ్జీ, కె.శారద తెలిపారు.

అన్నవరం ఎస్ఐ హరిబాబుకు సత్కారం

అన్నవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా అన్నవరం ఎస్ఐ హరిబాబు చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా ఎస్ఐను హ్యూమన్‌రైట్స్ కమిటీ స్టేట్ ప్రెసిడెంట్ వెగిశెట్టి తాతారావు శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బత్తుల రవికుమార్, రమేష్ ప్రసాద్, బచ్చల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.